

# కాలమ్ దాటని కబుర్లు

బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### నేనూ, బ్రౌనీ

మా పిల్లల చిన్నతనంలో రోజూ ఎక్కడి నుండో రెండో మూడో కుక్కపిల్లల్ని ఎత్తుకొచ్చేవారు. వాటికి వెంటనే రాజూ, పీజూ లాంటి పేర్లు పెట్టి, గోనె పట్టా పరిచి అందులో ముసుగు పెట్టి, నాకు కనిపించకుండా దాచి పెట్టే ప్రయత్నం చేసేవారు. వంటింట్లో పాలు మాయం అయ్యేవి. వాటి కోసం ఓ స్టీలు కటోరీ కూడా, కానీ నాకు ఓ గంట కల్లా వాటి ‘కుయ్యి కుయ్యి‘ శబ్దాలు వినిపించేసేవి. వెంటనే ‘వాటిని బయట పారేస్తారా? లేదా వీపులు వాయించెయ్యనా?” అని యుద్ధం ప్రకటించేదాన్ని! మా పిల్లల కళ్ళకి నేను అప్పుడు రాక్షసిలా కనిపించే ఉంటాను.

అప్పటిదాకా సాత్వికంగా ఉండే అమ్మలు ఇలా సడెన్‌గా జుట్లు విరబోసుకున్న దెయ్యాల్లా, కళ్ళు చింతనిప్పుల్లా మెరిసే రాక్షసుల్లా ఎందుకు మారిపోతారో వాళ్ళకి అర్థం అయ్యేది కాదు.

నా కాళ్ళు పట్టుకున్నంత పని చేసి వాటిని ఉండనిమ్మనీ, ఇంట్లోకి తీసుకురామని బతిమాలేవారు. "కావాలంటే నా బూస్టు వాటికి ఇచ్చెయ్యి" అనేవాడు బూరె బుగ్గలతో మా పెద్దవాడు.

"అవి నాకు బాగా అలవాటు అయిపోయాయి.. చూడు! రాజూ అంటే ఎలా వచ్చేస్తోందో. పాపం నాన్నకూడా లేడు! అమ్మ ఒక్కత్తే ఉంది" అని నాకు జాలికలిగించే ప్రయత్నం చేసేవాడు మా చిన్నవాడు.

చిన్నవాడు ఏదైనా అంటే మా వారు కాస్త మెత్తపడేవారు. "పోనీలే పాపం ఉండనీ" అనేవారు. నేను మాత్రం ససేమిరా అనేదాన్ని. వాళ్ళు ఏడ్చి అన్నాలు మానేసి సత్యాగ్రహాలు చేసి, ఒక్కోసారి వాటినే కౌగిలించుకుని పడుకున్నా కూడా, నేను జాగ్రత్తగా, వాళ్ళు నిద్రపోగానే తీసుకెళ్ళి ఎక్కడ నుండి తెచ్చారో అక్కడ పెట్టి వచ్చేసేదాన్ని.

తెల్లారి లేచి మా అశ్విన్ పెద్దపెద్దగా "రాజూ.. రాజూ" అని పిలిచి, అది రాకపోతే, "నా రాజూ ఏది?" అని కాళ్ళు బాదుతూ ఏడ్చేవాడు. అన్న బాదాడు కదా అని కృష్ణగాడు కూడా "రాజూ ఏడీ.. ఏడీ?" అని ఏడ్చేవాడు.

అప్పుడు మా అత్తగారు "నువ్వు మీ అమ్మ దగ్గర ఉన్నట్లే, అదీ వాళ్ళమ్మ దగ్గరకి వెళ్ళిపోయింది. అలా ఏడవకూడదు! పెద్దయ్యాక తెచ్చుకుందాం" అని సర్ది చెప్పేవారు. వాళ్ళు వినేవాళ్ళు కారు.

ఒక్కోసారి మళ్ళీ తెచ్చేసి, పందిరేసి గోనెపట్టా కప్పి, పక్కన బొచ్చెలో పాలు పోసి, వాళ్ళ బామ్మని కాపలా పెట్టి, నా నుండి కాపాడమని బతిమలాడి బడికి వెళ్ళేవారు. కానీ నేను మా అత్తగారు మడి కట్టుకునే లోపే వాటిని తీసుకెళ్ళి వాళ్ళమ్మ దగ్గర పడేసి వచ్చేదాన్ని!

బడినుండి రాగానే మళ్ళీ "రాజూ..పీజూ" అంటూ ఏడుపులూ, పెడబొబ్బలూ మామూలే!

ఈ విషయం రాస్తుంటే నాకు మా పరాంకుశం బాబాయ్ చెప్పిన నల్లరామ్మూర్తి జోక్ ఒకటి గుర్తుకొస్తోంది. నల్లరామ్మూర్తికి (అంటే మాయాబజారులో అసమదీయులు అని పలికే నటుడు) ఇలాగే చిన్నప్పుడు 'నానీ' అనే కుక్కపిల్ల ఉండేదిట. రోజూ నానీ పక్కనుంటేనే అన్నం తినే వాడుట. నానీ పక్కన ఉంటేనే హోం వర్క్ చేసేవాడట. "నానీ" అంటూనే లోపలికి వచ్చేవాడుట! ఇలా ఉండగా ఒకరోజు నానీ కాస్తా నూకలు చెల్లి చచ్చిపోయిందట. ఇంటిల్లిపాదీ రామ్మూర్తి బడి నుండి వచ్చి ఎంత గోల చేస్తాడో అని భయపడిపోయి, బేజారైపోయి ఉన్నారట. నల్ల రామ్మూర్తి బడి నుంచి వచ్చి "నానీ.." అని పిలుస్తూ "అన్నం పెట్టు. బడికి త్వరగా వెళ్ళాలి.. ఇన్‌స్పెక్టర్ వస్తున్నారు" అన్నాడుట.

వాళ్ళ అమ్మ అన్నం పెడుతుంటే "నానీ తిందా?" అని అడిగాడుట.

ఆవిడ నెమ్మదిగా అన్నం తిననిచ్చి "ఒరేయ్... నానీ చచ్చిపోయిందిరా!" అందిట.

"అలాగా!" అనేసి తేలిగ్గా వెళ్ళిపోయాడుట.

ఇంటిల్లిపాదీ హతాసులై, వెంటనే ఆనందభరితులై "పోనీలే తుపాను వస్తుంది అనుకుంటే, తేలిగ్గానే మబ్బు విడిచేసింది. గోల అవలేదు. అదృష్టం" అనుకున్నారట.

కానీ సాయంత్రం రామ్మూర్తి బడినుండి వస్తూనే "నానీ నానీ" అన్నాడు. ఇంటిల్లిపాదీ ఆశ్చర్యపోయారు. "ఇదేవిట్రా వీడు మధ్యాహ్నం నానీ పోయింది అంటే ఏమీ అనకుండా వెళ్ళిపోయి ఇప్పుడు మళ్ళీ పిలుస్తున్నాడు" అన్నాడు తాతగారు.

"నానీ.. ఏది?" రామ్మూర్తి గట్టిగా అడిగాడు.

తల్లి నెమ్మదిగా వచ్చి "నానీ పోయింది అని మధ్యాహ్నం చెప్పానుకదరా" అంది.

వెంటనే నల్ల రామ్మూర్తి కిందపడి ఏడుస్తూ "నానీ పోయింది అన్నావా? నేను నాన్న అనుకున్నాను" అన్నాడుట!

అలా ఏడ్చి ఏడ్చి నల్లగా అయిపోయాడుట! అందుకే రామ్మూర్తిని నల్ల రామ్మూర్తి అంటారుట. ఈ కథ పరాంకుశం బాబాయ్ చెప్పినప్పుడు నేను పడి పడి నవ్వాను. ఇప్పుడు పిల్లలు కుక్కపిల్లల గురించి ఏడుస్తూ, హఠం చేస్తుంటే మాత్రం ఏడుపొచ్చింది.

"నీ కెందుకంత మొండితనం? పోనీ నాలుగు రోజులు వాటిని పెంచుకోనివ్వచ్చుగా?" అంది అమ్మమ్మ.

నేను బేలగా "అమ్మమ్మా! బ్రౌనీ సంగతి మరిచిపోయావా?" అన్నాను.

ఇద్దరం కాసేపు టార్ టాయిస్ మస్కిటో కాయిల్‌లా మొహాల మీద చక్రాలు తిప్పుకుని గతంలోకి వెళ్ళాం. ఫ్లాష్ బ్యాక్‌లో....

నేను అప్పుడు ఏడో తరగతి చదువుతున్నాను. మా అమ్మ కజిన్ సిష్టర్ ఏ.ఎన్.ఎమ్ గా తాడూరు అనే విలేజ్‌లో మహబూబ్ నగర్ దగ్గర ఉద్యోగం చేసేది. హైదరాబాదు వచ్చినప్పుడు మా ఇంట్లోనే దిగేది మా నాగరత్నం పిన్ని.

"అక్కా దీన్ని శలవులకి నాతో పంపించు" అని ఓసారి మా అమ్మని అడిగింది.

మా అమ్మ సరే అంది.

ఇంకేవుందీ "పల్లెటూళ్ళు మన భాగ్యసీమరా - పాడిపంటలకి లోటు లేదురా" అని పాడుతూ లంగా ఓణీల్తో ఎగిరే అమ్మాయిల సినిమాలు తెగ చూసిన నేను వెంటనే నాలుగు గౌనులు సంచిలో పెట్టుకుని, కాళ్ళకి మాత్రం షూస్ వేసుకుని బయలుదేరాను.

"సిష్టరమ్మ ఇంటికి పట్నం నుండి వాళ్ళక్కగారి అమ్మాయి వచ్చింది" అని అంతా వచ్చి చూసెళ్ళారు. వచ్చిన వాళ్ళు అరిశలో, జంతికలో పట్టుకుని మరీ వచ్చారు. నాకు ఎంతో నచ్చారు.

ఒక బ్రాహ్మణ బామ్మగారింట్లో మా పిన్ని అద్దెకుంది.

"గుమ్మడి పూలు పొప్పులో వేసినా, గోగుకాడలు పులుసు పెట్టినా, పల్లికాయలు పచ్చడి రుబ్బినా" అనేదావిడ. అంతేకాకుండా మా పిన్ని చేసే వైద్యానికి పోటీగా భూత వైద్యం చేసేది. తేలు మంత్రం, పాము మంత్రం వేసేది. "పెరుమాళ్ళుని మూటగట్టుకుని పొలెం పోయొస్తా సిష్టరమ్మా.. ఇల్లు జాగ్రత్త" అనేది.

దేవుడిని కూడా మొబైలుగా వెంటపట్టుకెళ్ళడం ఆవిడ దగ్గరే చూసాను!

మా పిన్ని కొడుకు నన్ను పట్వారీగారి చేలలోకి షైరుకి తీసుకెళ్ళేవాడు. అక్కడ మోటబావీ, దానికి మోటరూ ఉండేది.

మా సరోజిని అమ్మమ్మ అద్భుతమైన పప్పుచారు పెట్టేది! ఆ ఘుమ ఘుమలు నేను ఈ జన్మలో మరువలేను. గోంగూర పచ్చడీ, పప్పుచారూ, గడ్డపెరుగులతో అక్కడ చెట్లకింద భోంచేసి. మోటబావికింద జలకాలాడి, తుప్పరేగుపండ్లూ, కంది కాయలూ కోసుకుంటూ తెగ సంబరపడి చీకటి పడే వేళకి వేరుశనగ మొక్కలు ఊడబీక్కుని ఇంటి దారి పట్టేవాళ్ళం.




ఓ నాలుగు రోజులు పల్లెటూరి ముచ్చటా, సరోజిని అమ్మమ్మ వండిపెట్టే పలహారాలతో బాగానే గడిచింది. ఆ తర్వాత ఇంటి బెంగా, అమ్మ మీద బెంగా మొదలయింది. మా పిన్ని హెల్త్ సెంటర్‌కి వెళుతుంటే "నేనూ వస్తా" అని వెంటపడేదాన్ని.

ఒకనాడు దీపాలు పెట్టే వేళ ఒక మనిషి సైకిల్ మీద పడుతూ లేస్తూ వచ్చి "నర్సమ్మా.... మా ఆడదానికి నొప్పులుస్తున్నాయి.. జల్దీరా!" అని కేకలు పెట్టాడు.

అప్పుడే కంచం ముందు కూర్చున్న మా పిన్ని లేచి హుటాహుటీ బయలుదేరింది. నేనూ మజ్జిగన్నం తినకుండానే చెయ్యికడిగేసుకుని పిన్ని మెడికల్ కిట్ పట్టుకుని తయ్యారయ్యాను.

"నువ్వొద్దు. చిన్నపిల్లవి దడుసుకుంటావు" అంది పిన్ని.

"దడుసుకోను!" అన్నాను. ఎందుకో తెలీకుండానే.

మా అమ్మమ్మ "ఆడపిల్లేగా దానికీ తెలియనీ. తీసుకెళ్ళు" అంది. మా సరోజిని అమ్మమ్మ మా అమ్మమ్మకి స్వయానా మేనకోడలు, చాలా ధైర్యస్తురాలు. ఆ కాలంలో విద్యావంతురాలూనూ!

"సరే.. త్వరగా పద" అంది పిన్ని.

మా కోసం గూడు బండి రెడీగా ఉంది. నాకు పండగే అయింది. నన్ను ఆ ఊళ్ళో పిల్లలు 'దొరసాని పిల్ల' అని పిలిచేవారు. అంతేకాదు "మా బంధువుల అమ్మాయి కూడా నీలాగా బడికెళ్ళి ఇంగ్లీషు చదువుకుంటుంది. పేరు పద్మ. నీకు తెలుసా?" అనేవారు.

మన హైదరాబాదులో ఒక బడే ఉంటుంది అని వాళ్ళు అనుకుంటుంటే నాకు తెగ నవ్వొచ్చేది!

ఆ గూడు బండి ఒక గుడిశ ముందు ఆగింది. అప్పటికే చాలామంది జనం మూగారు. లోపల నుండి "ఓరి దేవుడా.. నీ జిమ్మడా!" టైపులో ఏడుపులూ, అరుపులూ వినిపిస్తున్నాయి. ఆ తిట్లన్నీ ఆవిడ పతిదేవుడ్నిట!

"ఇక్కడే ఉండు" అని మా పిన్ని నన్ను లోపలికి రానీయకుండా ఆపి, తను తలవంచి గుడిశలోకి వెళ్ళింది.

నా దృష్టి అక్కడ కాస్త దూరంలో గడ్డిలో కదులుతున్న చిన్న చిన్న జీవాల మీద పడింది. అవి కుక్కపిల్లలు. అందులో మూడు నల్లవి. ఒకే ఒకటి గోధుమ వన్నెలో బొద్దుగా ముద్దుగా కనిపించింది. నేను ఉషారుగా పరిగెత్తాను. "దొరసానమ్మా మరీ ఒకరోజు పిల్లలు.. తల్లి చూస్తే కరుస్తుంది జాగ్రత్త!" అని ఇంటివాళ్ళు హెచ్చరించారు. నేను పట్టించుకోలేదు. ఆ గోధుమ రంగు కుక్కపిల్లని ఒళ్ళోకి తీసుకుని "బ్రౌనీ బ్రౌనీ' అని పిలుస్తూ ఆడసాగాను. మా గోలలో మేం ఉండగా, మా పిన్ని డెలివరీ చేసి మగపిల్లాడ్ని తల్లికిచ్చింది. అందరూ తెగసంబరపడ్డారు.

"నేను బ్రౌనీని తీసుకెళతాను" అంటే ఎవరూ పెద్దగా అభ్యంతర పెట్టలేదు!

మరునాడు మా అమ్మ వచ్చింది. నేను సంబరంగా నా కొత్త ఫ్రెండుని చూపించి" మనతో హైదరాబాద్ తీసుకెళదాం" అన్నాను.

"ఇంకా గుడ్డు అయినా విప్పలేదు. తల్లి పాలు తాగే వయసు. వద్దు" అంది.

నేను వినలేదు. ఏడుపు మొదలుపెట్టాను. మా అమ్మ మనసు కరిగి "మరి అమ్మమ్మ ఏం అంటుందోనే?" అంది.

"అమ్మమ్మని నేను ఒప్పిస్తాగా" అన్నాను. అలా ఆ బ్రౌనీని నా పరికిణీ కుచ్చిళ్ళ మధ్య దాచి బస్సులో పట్టుకొస్తుంటే, అది ఆకలికి దారిలో ఒకటే ఏడుపు. కండక్టర్ కనిపెట్టి "సత్యవతక్కా.. టికెట్ కొయ్యనా కుక్కపిల్లకి?" అన్నాడు. మా అమ్మ ఆర్.టీ.సీ.లో హెడ్ క్లర్క్. అందరూ తెలుసు.

నేను పాలు కొని సాసర్‌లో పోస్తే బ్రౌనీ తాగలేకపోయింది పాపం. నేను దూదిని పాలల్లో ముంచి దానికి అందిస్తే చప్పరించింది.

తీరా ఇంటికి తీసుకొచ్చాకా "ఛీ! ఛీ.. దాన్ని ఇంట్లోకి తేవద్దు" అని మా అమ్మమ్మ అరిచింది. మా అమ్మ నాకు అస్సలు సపోర్ట్ చెయ్యలేదు. పైగా ఈ అమ్మలు క్రైసిస్‌లో ప్రతిపక్ష నేతలైపోయి మనకే చీవాట్లు పెడతారు!

"మావిడి చెట్టుకింద వదిలేస్తాను... అస్సలు ఇంట్లోకి తేను" అని మా అమ్మమ్మని ఒప్పించాను. అలాగే దాన్ని గోనె సంచి పరిచి మావిడి చెట్టుకింద వదిలేసి ఇంట్లోకి వచ్చేసాను.

నేను హాయిగా నిద్రపోయాను.

కానీ బ్రౌనీ చలికీ, చీమలు కుట్టి తెల్లవార్లూ తెగ ఏడ్చిందిట. అమ్మమ్మ విని ఓర్చుకోలేక, వెళ్ళి దాన్ని ఇంట్లోకి తెచ్చి వెచ్చగా తన రగ్గులో కప్పి పక్కన పడుకోపెట్టుకుంది. అలా అది వచ్చిన రోజే అమ్మమ్మకి మాలిమి అయిపోయింది!

ఇక్కడితో కథ సుఖాంతం అనుకుంటే మీరు పప్పులో కాలేసినట్లే! అక్కడి నుండీ అసలు కథ మొదలయింది.

బ్రౌనీతో మేం పడ్డ కష్టాల పర్వం ప్రారంభం అయింది.

దిన దిన ప్రవర్ధమానమౌతూ మా బ్రౌనీ సింహంలాంటి జూలుతో, వింజామరలాంటి తోకతో కాలనీలో అందరికీ సింహ స్వప్నంలా ఎదిగింది!

తడకలూ, ఫెన్సింగూ దానికి ఆగేవికావు. ఒక్క గెంతుతో లాంగ్ జంప్‌లో ఉరికి పారిపోయేది. అందుకని మా అమ్మమ్మ బార్బ్‌డ్ వైరుతో ఫెన్సింగ్ అల్లించింది. అది ఇంటి ముందునుండి ఏ బర్రెలో, మేకలో వెళుతుంటే, అరుస్తూ ఆ వైరులో నుండీ దూసుకుని వెళ్ళిపోయేది. ఒళ్ళంతా క్షతగాత్రమై రక్తాలు కారుతున్నా, వీరయోధుడిలా దూసుకెళ్ళేది!

మా ఇంటికి చుట్టాలొస్తే వీధి చివర నుండే "బ్రౌనీని కట్టేసారా?" అని అరుస్తూ వచ్చేవాళ్ళు.

మా లక్ష్మి అక్క అందరికన్నా ఎక్కువ భయపడేది! అది విప్పేసి ఉంటే, దాని అరుపుకి లక్ష్మక్క "రక్షించండి.. రక్షించండి" అని అరిచేది.

ఒకసారి గ్యాస్ సిలిండర్ వాడొచ్చాడు. కట్టేసినా అది భీకరంగా అరుస్తూ వదిలించుకుని దూసుకొచ్చింది.

వాడు 'బాబోయ్' అని అరుస్తూ వెల్లకిలా పడిపోయాడు. వాడి గుండెల మీద కాలుపెట్టి 'వీర తిలకం' దిద్దమన్నట్లు మా బ్రౌనీ మా కేసి చూస్తోంది,

"ఏం చెయ్యదులే బాబూ" అంది మా అమ్మ. కుక్క ఉన్న వాళ్ళు సాధారణంగా అనే పడికట్టు మాట ఇది!

మా నాన్న గెడ్డం చేసుకుంటూ ఇది విని "అది ఓ పక్కన వాడిని ఫలహారం చేస్తుంటే, మీ అమ్మ ఏం చెయ్యదు అంటుందేవిటీ?" అన్నారు.

ఎలాగో మా అమ్మమ్మ వాడిని రక్షించి పంపించింది.

మా బ్రౌనీ ప్రతిరోజూ సాయంత్రం ఆరుగంటలకి చార్మినార్ సిగరెట్ ఫ్యాక్టరీ నుండి వెళ్ళే ఒక రెడ్ టర్బన్ అతన్ని చూసి పిచ్చిగా అరిచేది. వదిలేసి ఉంటే వెళ్ళి అతన్ని అడ్డగించేది!

ఒక రోజు అది పడుకునుంది. రెడ్ టర్బన్ అతను వెళుతున్నాడు. బ్రౌనీ చూడలేదు. మా అమ్మ ఈ విషయం గమనించి, దానికి అర్థం కాకూడదని "రెడ్ టర్బన్ మాన్ ఈజ్ గోయింగ్" అంది ఇంగ్లీషులో.

అంతే! ఇది వెంటనే బయ్యమని అరుస్తూ వెళ్ళి అతని మీద పడింది!

మా బ్రౌనీ అస్సలు ఫెయితూ, లాయల్టీ లేని జంతువు అనిపించేది!

మునిసిపాలిటీ బండి పట్టుకెళ్ళకుండా పది రూపాయలు పెట్టి లైసెన్స్ కొని ఎప్పుడు మెడలో వేసినా, ఎవరో ఒకరికి ఇచ్చి వచ్చేది!

మా ఇంట్లోంచి తప్పించుకుని వెళ్ళి ఒక్కోసారి మూడు రోజులయినా వచ్చేది కాదు! మా అమ్మమ్మ అది వచ్చేదాకా అన్నం తినేది కాదు!

అది నా పెంపకంలో పెరిగిందేమో అస్సలు డిసిప్లిన్ లేకుండా తయ్యారయింది!

ఒకసారి ఎవడో మా ఇంటి ముందు నుండి చెయిన్ కట్టి తీసుకువెళుతుంటే ఉషారుగా తోక ఊపుతూ, తలవంచుకుని వాడితో వెళ్ళిపోతోంది! మా ఆయన (అప్పటికింకా మా పెళ్ళి కాలేదు. డిగ్రీ చదువుతున్నాడు) మా అన్నయ్యతో "మురళీ.. ఓ తుమారా కుత్తా హై నా?" అన్నాడు.

మా అన్నయ్యకి సిగ్గుతో తలవాలిపోయిందట, "బ్రౌనీ" అని వాడు పిలిస్తే అది నిర్లక్ష్యంగా ఓ చూపు చూసి ముందుకి వెళ్ళిపోయింది. అస్సలు కృతజ్ఞత లేని కుక్క అని మా అన్నయ్య ఆ రోజు తెగ తిట్టాడు.

బ్రౌనీ వల్ల మా అన్నయ్య ఇంకా కష్టాలు పడ్డాడు.

ఒక రోజు మా అమ్మ చూస్తుండగానే కుక్కల బండిలో ఎక్కించుకు వెళ్ళిపోయారు. ఈవిడ గుండెలు బాదుకుంటూ ఏడుస్తూ "బ్రౌనీని విడిపించుకురారా" అని మా అన్నయ్యని ధూళ్ పేట పంపించింది. అప్పట్లో ఒకరోజంతా యజమానులొచ్చి ఫైను కడతారేమో అని చూసి మరునాడు విషపు ఇంజెక్షన్ ఇచ్చి చంపేసేవారు. అందుకని అమ్మమ్మ ఏడుపు. సరే తప్పేదేముందీ? మా అన్నయ్య ధూళ్ పేట వెళ్ళి అక్కడ కటకటాల వెనకాల ఉన్న వందలాది కుక్కల్ని "బ్రౌనీ" అని పిలిస్తే అన్నీ లేచి వచ్చాయుట!

"అకటా.. మా పెదనాన్నగారు హనుమంతయ్యాగారికీ లంకలో సీతమ్మ ఎవరో కనిపెట్టడానికి ఇదే అవస్థ వచ్చింది అలనాడు!" అని ఘటోత్కచుడు మాయాబజార్‌లో వగచినట్లు వగచి, అంతలోనే అయిడియా వచ్చి 'లొట్ట' వేస్తే మా బ్రౌనీ పరిగెత్తుకుని కటకటాల దగ్గర నిలబడి నాలుక బయటపెట్టి, కళ్ళనుండి నీరు కారుస్తూ దీనాతి దీనంగా ఏడ్చిందట!

మా అన్నయ్య ఫైను కట్టి, చైను కట్టి, మళ్ళీ లైసెన్స్ అనే తాళి బొట్టు కొని దాని మెడలో ధరింప చేసి ఆ పాత బస్తీ ఏరియాలో బయటకి రాగానే ఆటోలు దొరకలేదట! కొంచెం దూరం నడుద్దాం అనుకుని నడుస్తూ ఉండగా బ్రౌనీ దారే పోయే ఒక స్త్రీ శునక రాజకుమారిని చూసి, పుంజీలు తెంపుకుని పరిగెత్తిందట.

మా అన్నయ్య ఆ రష్‌లో, ట్రాఫిక్‌కి అడ్డం పడి పరిగెత్తలేక, ఏడుపు మొహంతో, ఇంక బ్రౌనీ లేనప్పుడు ఆటో ఎందుకని బస్ ఎక్కి "అమ్మమ్మకి ఏం చెప్పాలి? తిడుతుందేమో" అని భయపడుతూ చార్మినార్ చౌరస్తా దగ్గరున్న ఆర్.టీ.సీ కాలనీలో ఉన్న మా ఇల్లు చేరాడు.

వీడు గంట ప్రయాణం చేసి, అలసటతో, భయంతో ఇల్లు చేరేటప్పటికి కనిపించిన దృశ్యం ఏమిటంటే, హాయిగా స్నానం చేసిన బ్రౌనీ మా అమ్మమ్మ ఒళ్ళో వెచ్చగా పడుకుని ఉంది. ఆ అపురూప దృశ్యం చూసేసరికి మావాడికి చిర్రెత్తుకొచ్చిందిట!

అసలు మా బ్రౌనీ ఎవర్నీ కరవలేదు. దానికి ఆర్నెల్లకి ఓ సారి అది కరిచినా, కరిచిన వాళ్ళకి ఏమీ అవకుండా ఇంజెక్షన్ ఇప్పించేవాళ్ళం, ఆ డాక్టర్ గారు "ఇది అస్సలు మీ మాట వినదు. మీ డాగ్ ఏనా?" అని అడిగేవారు. అంత ఇన్ డిసిప్లిన్డ్!

ఒకే ఒకసారి మా బ్రౌనీని నేను బాగా కొట్టాను. అది పెరట్లోకి దూకిందని భీకరంగా పోట్లాడి పిల్లిపిల్లని చంపేసింది. నేను ఇది చూసి దీన్ని కర్ర తీసుకుని బాగా కొట్టాను. మా అమ్మమ్మ వచ్చి నా చేతిలోంచి కర్ర తీసుకుని విరిచి పారేసి "దాని జాతి ధర్మం అది.. అది జంతువు.. నువ్వు చేసింది అధర్మం.. నోరు లేని జీవాల్ని కొడతావా? మళ్ళీ కాసేపటికి నువ్వు పిలిచి అన్నం పెడితే వచ్చి నీ కాళ్ళు నాకుతూ  తోక ఊపుతుంది పాపం!" అంది.

ఆ తర్వాత చాలాసార్లు నేను చేసిన పనికి నేను పశ్చాత్తాపపడ్డాను.

బ్రౌనీ శుద్ధశాకాహారి. అమ్మమ్మతో బాటు ఉపవాసాలు చేసేది! గుడ్డు పెట్టినా అరక్క కక్కుకునేది.

"దీనికి వడుగు చేద్దామా?" అనేదాన్ని నేను.

అమ్మమ్మంటే దానికి ప్రాణం. ఆవిడ మా పెద్దమ్మ ఇంటికి నాగ్‌పూర్ వెళితే బెంగపెట్టుకుని అన్నం మానేసి చిక్కిపోయేది.

"ఇది సింహం పిల్లరా.. కుక్కకాదు! అనేది అమ్మమ్మ. నాకు మాత్రం తోడేలు ఏమో అని చాలా అనుమానంగా ఉండేది. అసలు ఇది కుక్కలన్నీ అరిచినప్పుడు అరిచేది కాదు! సైజు కూడా జేగాంటీ సైజులో ఉండేది! నిలబడితే నా ఎత్తు ఉండేది.

మా అన్నయ్య ఫ్రెండ్స్ ఎవరొచ్చినా అరిచేది. కానీ మా వారిని పెళ్ళికి ముందు చూసికూడా అరిచేది కాదు. ప్రేమగా తోక ఊపుతూ తిరిగేది.

మా బ్రౌనీ పాడు చెయ్యని వస్తువు ఇంట్లో ఉండేది కాదు! "దీనిని ఎవరికైనా ఇచ్చేద్దాం "అని మా అమ్మ ఒకటి రెండుసార్లు అనుకుంది. ఇది విని ఒకాయన "నాకు ఇవ్వండి. నేను ఎలాంటి కుక్కకైనా ట్రైయినింగ్ ఇవ్వగలను" అని వెంటపడ్డాడు.

మేమూ ఇచ్చేద్దాం అనుకున్నాము. ఇంక ఇచ్చేద్దాం అనుకుంటూ ఉండగా మాకో భయంకరమైన నిజం మా అన్నయ్య ఫ్రెండ్ ద్వారా తెలిసింది. ఆయన నిమ్మచెట్టు బాగా కాయడానికి కుక్కల్ని కొట్టి చంపి నిమ్మచెట్టు మొదట్లో పాతి పెడతాడట! ఇది తెలిసి మేం వణికి పోయాం.

"ఎంత సుకృతం చేసుకుందో ఈ ప్రాణి! దేవుడి నైవేద్యాలతో పెరిగింది" అనేది మా అమ్మమ్మ.

అలాంటి బ్రౌనీ తొమ్మిదేళ్ళు బ్రతికి చివరి రోజుల్లో చాలా జబ్బు పడింది. నేను రోజూ ఎత్తుకెళ్ళి సెలైన్ పెట్టించి తెచ్చేదాన్ని!

అది పోయిన రోజు మేం తట్టుకోలేక బెంగటిల్లి ఏడ్చాము. మా అమ్మమ్మ అయితే మంచాన పడిపోయింది. ఆవిడ దాని శవాన్ని చూడలేదు. నాగ్‌పూర్ వెళ్ళింది.

మా ఆయనా, ఇంకో కాబోయే బావగారూ వెళ్ళి పాతిపెట్టి వచ్చారు.

అమ్మమ్మ బ్రౌనీ లేని ఇంటికొచ్చి వెక్కి వెక్కి ఏడ్చింది. నా కైతే కోలుకోడానికి చాలా రోజులు పట్టింది. ఇంత దీర్ఘమైన బాధ పడ్డాకా, బ్రౌనీతో ఎమోషనల్ ఎటాచ్ మెంట్ పెంచుకున్నాకా ఇంకెప్పుడూ బ్రతికుండగా కుక్కని పెంచను. ఏ మూగజీవితో అనుబంధం ఏర్పరచుకోను' అని ప్రతిజ్ఞ తీసుకున్నాను!

ఇదంతా నేనూ అమ్మమ్మా ఓసారి జ్ఞాపకం చేసుకున్నాం.

అందుకే మా పిల్లలు ఎన్నిసార్లు అడిగినా కుక్కని పెంచడానికి నేను ఒప్పుకోలేదు.

**కుక్క ఓ విశ్వాసం ఉన్న ప్రాణి.**

**అది గొప్పా బీదా తారతమ్యాలు యజమానిలో చూడదు! దాని యజమాని దానికి పూరిగుడిశలో ఉన్నా మల్టీ మిలినీర్ కన్నా గొప్ప!**

**అది విలాసవంతమైన జీవనం.. ఖరీదైన ఆహారం అడగదు! గోరంత ప్రేమకి కాళ్ళు నాకుతూ వస్తుంది! తిట్టినా కొట్టినా కోపం పెంచుకోదు!**

**కానీ పుచ్చుకోకుండా మన ఇంటివైపు ఎవరైనా చూస్తే అరుస్తుంది! కాపలా కాస్తుంది. మనకి చేతికర్ర అయి తోడొస్తుంది! ఎక్కడికెళుతున్నా మార్గదర్శియై ముందు నడుస్తుంది! లగ్జరీస్, పాకెట్ మనీ అస్సలు అడగదు!**

ఓసారి మా పిల్లలు 'టిమ్మీ' అనే ఊరకుక్కకీ ఎదురిటి ఆల్సేషియన్ డాగ్‌కీ పెద్ద పెట్టున హడావుడి చేసి 'పెళ్ళి' జరిపించారు!

ఎదురింటి కుక్కకి టిమ్మీలాంటి ఊరకుక్క పుట్టకుండా పమేరియన్, ఆల్సేషియన్ కలిపి పెద్ద సైజు బొచ్చు కుక్క పుట్టింది!

Dog is a faithful Animal!

●●●

Post your comments